# శివశక్తి

"నేనేమన్నా మీ బానిస ననుకున్నారా?" పళ్ళు బిగించింది పార్వతీదేవి.

"నేనెప్పుడన్నానా మాట?" ఆశ్చర్యపోయాడు పరమశివుడు.

"లేకపోతే ఇష్టం వచ్చినట్టు ఆ పనులు చెప్పడమేమిటి?" అంది కాత్యాయిని.

"ఏం? ఈ మాత్రం చెప్పకూడదా; భర్త అన్నవాడు?" అన్నాడు మహేశ్వరుడు.

"చెప్పడానికిక్కడా సమయం, సందర్భంలేదా" అంది దాక్షాయణి.

"నా బాధలు నీ వీలు ప్రకారం వస్తాయేమిటి?" అన్నాడు గంగాధరుడు.

"అనవసరంగా వాగి, "నన్ను విసిగించకండి" అంది చండిక.

"విసిగిస్తే ఏం చేస్తావేమిటి"? రెట్టించాడు మహాకాలుడు.

"ఏమైనా చేస్తాను" గర్జించింది భైరవి.

"నోర్మూయ్! వాగావంటే తంతాను" భూంకరించాడు భూలేశుడు.

'తన్నండి చూద్దాం?' కంఠమెత్తి కాలు దువ్వింది కరాళకాళిక, ఉవ్వెత్తున లేచాడు ఉగ్రదేవుడు.

కంఠంలోని కాలకూటం కళ్ళలో కెగజిమ్మింది

జటాజూట వియద్గంధ అతలాకుతలమైంది

అలంకృత సర్పభూషణాలు తల్లక్రిందులైనాయి.

వామదేవుడి కుడిచెయ్యి, భవాని ఎడం చెంప మీద వాలబోయింది.

పక్క కొక్క దూకు దూకింది రుద్రాణి. విసురుగా వస్తున్న ఆ చేతిని తన కుడిచేత్తో ఆపింది.

మణికట్టు దగ్గర వొంచింది. తన ఎడం చేత్తో శివుడి మోచెయ్యిని నొక్కి తిప్పి, భుజం దగ్గర మెలిపెట్టింది.

మొగ్గతిల బడ్డాడు మృత్యుంజయుడు. గాలిలో పిల్లి గంతులేసి పాదాలతో పరమేశ్వరిని తన్నబోయాడు.

అంతే! పరమోగ్రమూర్తి అయింది పర్వతరాజ తనయ! శంకరార్ధాంగ సౌందర్యశరీర! రాజ రాజార్చిత పదసరోజ!! మహాదేవ రతోత్సుక మహాదేవి!

కాళ్ళమీదా, చేతులమీదా, నడుం మీదా, పొట్టమీదా, భుజాలమీదా, పిక్కలమీదా, తొడలమీదా ఎక్కడ పడితే అక్కడ తొక్కి పారేసి ప్రతిపురాంతకుడి మీదెక్కి తాండవ మాడేసింది సర్వమంగళ!



బోర్లాపడి, వెల్లికితలాపడి, "ఆహా! ఓహో! అమ్మా! అబ్బా!" అనసాగాడు త్రిలోచనుడు.

అఖండకాలం ఖండమైంది. అంబ అలసిపోయి శాంతించింది. శ్మశానవాసి శవాసనం వేశాడు.

పక్కన కూర్చుని పైటతో విసరసాగింది పార్వతి.

"ఏం స్వామీ! తిక్క కుదిరిందా?" అని అడిగింది.

"ఎవరి తిక్క" మూడో కన్ను అరమోడ్పుగా తెరిచాడు సదాశివుడు.

"ఓహో ఇంకా నాశక్తి తెలియలేదన్నమాట మీకు" అంది ఆదిశక్తి.

దిగ్గున లేచాడు దిగంబరుడు. కామేశ్వరిని కౌగలించాడు.

"ఏమిటే నీ శక్తి శర్వాణీ! ప్రళయతాండవం చేసి ఒళ్ళు నొప్పులుగా వుంది. కాస్త కాళ్ళు పిసకవే, ఒళ్ళు తొక్కవే అంటే నీ బానిసననుకున్నావా? మగవాళ్ళకి చాకిరీ చెయ్యడమేనా ఆడవాళ్ళ పని? అంటూ ఏవే మిటో కలికాలపు మాటలు మాట్లాడావు! ఇప్పుడు నువు చేసిందేమిటి?! నా ఒళ్ళు తొక్కడం కాక? పిచ్చిదానా! కావాలని నీకు కోపం తెప్పించి నీచేత నా ఒళ్ళు తొక్కించుకున్నాను కాబట్టి సరిపోయింది కాని, నాకన్నా నువ్వే బలవంతురాలివయి, నీకే నిజంగా కోపం వచ్చుంటే, మహిషాసురడల్లే ఈ పాటికి నేనూ చచ్చుండేవాణ్ణి కాదూ!" అంటూ హైమవతి కుంతలాగ్రంలో చంద్రకాంతాలుంచాడు మహానటుడు.